
సాక్షి
గుంటూరు
ఆదివారం । 10 । నవంబర్ । 2024



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 8788 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా, దిగువకు 12000 క్యూసెక్కులు వదులుతున్నారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 587.40 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడికాలువకు 10,120 క్యూసెక్కులు వదిలారు.

సహస్ర లింగార్చనలు



ఫిరంగిపురం: తక్కెళ్లపాడు గ్రామంలోని వీరాంజనేయ స్వామి ఆలయంలో కార్తికమాసాన్ని పురస్కరించుకొని శనివారం సహస్ర లింగార్చన పూజలు వైదిక సంప్రదాయబద్ధంగా నిర్వహించారు.

న్యూస్‌రీల్

ఉచిత న్యాయసేవలను పొందవచ్చు

ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె నరేంద్రరెడ్డి




చిలకలూరిపేట: ఆర్థిక స్థోమత లేని వారు మండల న్యాయసేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయసహాయం పొందవచ్చని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె నరేంద్రరెడ్డి చెప్పారు. మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పసుమర్రు గ్రామంలోని జెడ్పీ హైస్కూల్‌లో జాతీయ న్యాయసేవా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ న్యాయ సహాయం కోసం స్వయంగా మండల న్యాయసేవాధికార సంస్థను సంప్రదించటంతో పాటు, ఉత్తరం రాయడం, లేదా నల్సా హెల్ప్‌లైన్ నంబర్ 15100లో సంప్రదించవచ్చన్నారు. దీంతో పాటుగా కక్షిదారులు లోక్‌అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవడం ద్వారా సత్వర న్యాయం పొందవచ్చని వెల్లడించారు. వివిధ చట్టాలపై సీనియర్ న్యాయవాదులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యాయవాదులు పి వెంకటేశ్వరరావు, జీవీహెచ్ ఎస్ ప్రసాద్, ఎం భానుప్రసాద్, రూరల్ ఎస్‌ఐ జి అనిల్‌కుమార్, స్కూల్ హెచ్‌ఎం వై హనుమంతరావు పాల్గొన్నారు.

అమరేశ్వరునికి లక్ష బిల్వార్చన




అమరావతి: పంచారామ క్షేత్రాలలో ప్రథమారామక్షేత్రమైన అమరావతి అమరేశ్వరాలయంలో శనివారం లోక కల్యాణార్థం ప్రజలంతా సుభిక్షంగా సుఖసంతోషాలతో జీవించాలనే సంకల్పంతో దాతల సహకారంతో అమరేశ్వరునికి లక్షబిల్వార్చనను అత్యంత భక్తి శ్రద్ధలతో ఆలయ అర్చకులు, వేదపండితులు జరిపించారు. తొలుత మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని నిర్వహించి గణపతి హోమం నిర్వహించారు. స్వామివారికి విశేష అలంకరణ అనంతరం సహస్ర నామాలతో రుత్విక్కులు అమరేశ్వరునికి లక్ష బిల్వదళార్చన నిర్వహించారు. బాలచాముండికా అమ్మవారికి లక్ష కుంకుమార్చనలు చేశారు. కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి శ్రీపుష్పయాగం



నగరంపాలెం: స్థానిక ఆర్ అగ్రహారం శ్రీ వెంకటేశ్వరస్వామివారి దేవస్థానంలో శనివారం శ్రీ పుష్పయాగ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. కార్తిక మాసం, శ్రవణా నక్షత్రం స్వామివారికి పంచామృతాలతో అభిషేకం, అలంకార పూజ అర్చన కార్యక్రమాలను వేద పండితులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవెంకటేశ్వరస్వామి వారి కల్యాణ మహోత్సవం అత్యంత రమణీయంగా చేపట్టారు. 21 రకాల పుష్పాలతో పుష్పయాగ మహోత్సవం భక్తి ప్రపత్తులతో నిర్వహించగా, భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. కార్యక్రమాలను ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు కన్నా లక్ష్మీనారాయణ పర్యవేక్షించారు.

సాగునీటి సమాచారం



తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శనివారం 5706 క్యూసెక్కులు విడుదల చేశారు. హై లెవల్ కాలువకు 292 క్యూసెక్కులు, బ్యాంక్ కెనాల్‌కు 1089 క్యూసెక్కులు, తూర్పు కెనాల్‌కు 540 క్యూసెక్కులు, పశ్చిమ కెనాల్‌కు 178 క్యూసెక్కులు, నిజాంపట్నం కాలువకు 398 క్యూసెక్కులు, కొమ్మమూరు కాలువకు 3040 క్యూసెక్కులు విడుదల చేశారు.

వీఆర్‌కు అరండల్ సీఐ

లక్ష్మీపురం: బోరుగడ్డ అనిల్‌కుమార్‌కు మర్యాదలు చేసిన విషయంలో అరండల్ పేట సీఐ కె.శ్రీనివాసరావును వీఆర్‌కు పంపిస్తూ గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. తదుపరి ఘటనకు సంబంధించి దర్యాప్తునకు ఆదేశించారు. పోలీస్ అధికారులు, సిబ్బంది నిబంధనలు పాటించాలని లేని పక్షంలో క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు.

అవమానాలు.. వేధింపులు!

- ఇప్పటికే ఒకరికి 150 - 200 కుటుంబాల బాధ్యతలు
- వందరోజుల పాలన స్టిక్కర్లు అంటించేదీ వీళ్లే..
- మరుగుదొడ్ల ఫొటోల అప్‌లోడ్ బాధ్యత వీళ్లదే..
- కొత్తగా జియో ట్యాగింగ్ బాధ్యతలు సైతం..
- వలంటీర్లు చేసిన పనులన్నీ సచివాలయ ఉద్యోగులకే
- పెరుగుతున్న పనిభారం.. భవిష్యత్‌పై అనుమానం
- స్థాయి దిగజార్చేలా పద్ధతి ప్రకారం కుట్ర జరుగుతోందంటున్న పరిశీలకులు

గతమెంతో ఘనం.. వర్తమానం అధ్వానం. నాడు రాచఠీవి.. నేడు భవిత ఎండమావి. ఇదీ సచివాలయ ఉద్యోగుల దీనస్థితి. వలంటీర్లను పక్కనబెట్టి, వారి పనులన్నింటినీ వీరి నెత్తిన పెట్టడమే కాకుండా రోజుకో కొత్త బాధ్యతను అప్పగిస్తూ మోయలేని భారాన్ని ప్రభుత్వం మోపుతోంది. ఉన్నత చదువులు చదివి, తమను తాము నిరూపించుకుందామని ప్రభుత్వ ఉద్యోగంలో చేరిన వీరికి ఇంటింటికి తిరిగి స్టిక్కర్లు అంటించే పనులు, మిగతావారు వద్దన్న పనులు సైతం అప్పగిస్తూ అవమానభారానికి గురిచేస్తోంది. తాజాగా జియో ట్యాగింగ్ పనులు సైతం అప్పగిస్తూ మరింత ఒత్తిడిలోకి నెట్టింది.

సాక్షి ప్రతినిధి, గుంటూరు: కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత సచివాలయ ఉద్యోగులను ఒక పద్ధతి ప్రకారం పెద్ద వలంటీర్లుగా మార్చేస్తోందనే విమర్శ సర్వత్రా వినిపిస్తోంది. వలంటీర్ల సేవలను నిలిపివేసిన ప్రభుత్వం వారు చేసిన పనులన్నింటినీ సచివాలయ ఉద్యోగులపై రుద్దుతోంది. రోజుకో కార్యక్రమాన్ని వీళ్ల నెత్తిన పెట్టడంపై సచివాలయ ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. తాజాగా ప్రతి ఇంటిని జియో ట్యాగింగ్ చేసే బాధ్యతను సైతం అప్పగిస్తూ పని ఒత్తిడిని మరింత తీవ్రం చేయనుంది.

స్టిక్కర్లు అంటించే పనులు సైతం..

పెద్ద వలంటీర్లుగా సచివాలయ ఉద్యోగులు



కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వలంటీర్లను ఆపివేసి పింఛన్ల పంపిణీ బాధ్యతను సచివాలయ సిబ్బందికి అప్పగించిన సంగతి తెలిసిందే. గతంలో వలంటీరుకు 50 నుంచి 60 కుటుంబాలు మాత్రమే ఉండగా, మూడు క్లస్టర్లు కలిపి అంటే సుమారు 150 నుంచి 200 కుటుంబాల బాధ్యతను సచివాలయ సిబ్బందికి అప్పగించారు. తర్వాత కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలన పూర్తి అయిన తర్వాత మాది మంచి ప్రభుత్వం అంటూ ఇంటింటికి తిరిగి స్టికర్లు అంటించే బాధ్యతను కూడా అప్పగించారు. తర్వాత ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్వహణ ఫొటోలు తీసి అప్‌లోడ్ చేసే బాధ్యతను కూడా సచివాలయ సిబ్బందికే అప్పగించారు. ఈ బాధ్యత గతంలో ప్రభుత్వోపాధ్యాయులు నిర్వహించేవారు. వారు దీన్ని వ్యతిరేకించడంతో కొత్త ప్రభుత్వం రాగానే ఆ బాధ్యతను సచివాలయ సిబ్బందికి బదిలీ చేసింది. బ్యాంక్ అకౌంట్‌కు ఆధార్ లింక్ అయ్యిందా లేదా చూసే బాధ్యత కూడా వీరికే అప్పగించారు.



సచివాలయ ఉద్యోగులకు ఇచ్చిన జియో ట్యాగింగ్ యాప్

తాజాగా జియో ట్యాగింగ్..

తాజాగా ప్రతి ఇంటికి వెళ్లి జియో ట్యాగింగ్ చేసే బాధ్యతను అప్పగిస్తూ ఆదేశాలు వచ్చాయి. గతంలో ప్రతి ఇంటిని ట్యాగింగ్ చేసి వారికి పథకాలు అందుతున్నాయా లేదా అన్న బాధ్యతను వలంటీర్లు నిర్వహించేవారు. ఇప్పుడు ఈ బాధ్యతను కూడా వీరికే అప్పగించారు. దీనికోసం ఎంప్లాయీ మొబైల్ యాప్ పేరుతో ఒక యాప్‌ను కూడా సిద్ధం చేశారు. పైగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బహిరంగ సభల్లో మాట్లాడుతూ పింఛన్లు ఇంటికి వచ్చి ఇవ్వకపోతే నిలదీయండంటూ ప్రజల్ని సచివాలయ ఉద్యోగులపైకి రెచ్చగొడుతున్నారు. ఎన్నికలకు సంబంధించి క్షేత్రస్థాయిలో అంగన్‌వాడీలు నిర్వహిస్తూ వచ్చిన బీఎల్‌ఓ (బూత్ లెవల్ ఆఫీసర్) బాధ్యతలను కూడా సచివాలయ ఉద్యోగులకే అప్పగించారు. ఇప్పుడు సుమారు ఆరేడు జిల్లాల పరిధిలో ఎంఎల్‌సీ ఎన్నికలు జరుగుతున్నాయి. పట్టభద్రుల ఓట్ల నమోదు ప్రక్రియలో వాటిని తనిఖీ చేసే బాధ్యత కూడా వీరికే అప్పగించారు. ఈ బాధ్యతలు నిర్వహించినందుకు చెల్లించాల్సిన మొత్తాన్ని ఇప్పటివరకూ చెల్లించలేదు.

సచివాలయ వ్యవస్థపై స్పష్టత ఇవ్వాలి



రాష్ట్రంలోని సచివాలయ వ్యవస్థ కొనసాగిస్తారా? లేదా అన్న విషయంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి. సచివాలయ ఉద్యోగులను ఆయా మాతృశాఖల్లో పదోన్నతులు ఇస్తారా లేక వివిధ శాఖల్లో విలీనం చేస్తారా అనే విషయం తేల్చి చెప్పాలి. ప్రజలకు ప్రభుత్వం తరఫున వివిధ సేవలు అందించడానికి సచివాలయ ఉద్యోగులు ఎప్పుడూ సిద్ధంగా ఉన్నారు. గత నాలుగు నెలల నుంచి సచివాలయ ఉద్యోగులకు అప్పగిస్తున్న వివిధ విధుల (పాఠశాలల్లో మరుగుదొడ్ల ఫొటోలు తీయడం, ఇంటింటికి వెళ్లి స్టిక్కర్లు అతికించడం, ప్రతి ఇంటి జియో కో–ఆర్డినేట్స్ ట్యాగింగ్ చేసుకోవడం) వల్ల ఉద్యోగులు తీవ్ర అసంతృప్తిలో ఉన్నారు.

– షేక్ అబ్దుల్ రజాక్, ఆంధ్రప్రదేశ్ గ్రామ/వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

పదోన్నతులు ఏవీ?

సచివాలయ వ్యవస్థ వచ్చి ఐదేళ్లు దాటిన తర్వాత కూడా తమ భవిష్యత్ ఏంటనే ప్రశ్నలు వారిలో ఉత్పన్నం అవుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా లక్షా 20 వేల మంది ఉద్యోగులు ఉండగా వ్యవసాయ శాఖలో ఉన్న కేవలం 250 మందికి మాత్రమే పదోన్నతులు వచ్చాయి. మిగిలిన వారికి ఏ మాత్రం అవకాశం లేకుండా పోయింది. అందరూ గ్రాడ్యుయేషన్, పోస్టు గ్రాడ్యుయేషన్, బీటెక్‌లు చదివి ఈ ఉద్యోగంలోకి వచ్చిన వారే. వారందరినీ వలంటీర్ల స్థాయికి దిగజార్చే ప్రక్రియను ప్రభుత్వం ఒక క్రమ పద్ధతిలో అమలు చేస్తూ వస్తోంది. వారి మధ్య ఐక్యత లేకపోవడం వల్ల ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను ప్రశ్నించలేని పరిస్థితి ఉంది. సచివాలయ ఉద్యోగులకు సంబంధించి ఏం నిర్ణయం తీసుకోవాలన్న విషయంపై ముగ్గురు మంత్రులతో కమిటీ ఏర్పాటు చేసినప్పటికీ ఇప్పటి వరకూ స్పష్టమైన నిర్ణయం వెలువడలేదు.

రక్తనిధి కేంద్రానికి రూ.5లక్షల ఎంపీ నిధులు

- ప్రకటించిన రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి
- ఇప్పటికే రూ.5 లక్షలు మంజూరు చేసిన ఎంపీ



రక్తనిధి కేంద్రాన్ని సందర్శించిన ఎంపీ అయోధ్య రామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి

నరసరావుపేట: ప్రభుత్వ వైద్యశాలలో రెడ్‌క్రాస్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కంజుల జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో పూర్తయి త్వరలో ప్రారంభించబోతున్న కాంపోనెంట్ బ్లడ్‌సెంటర్‌కు రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి మరో రూ.5లక్షలు తన ఎంపీ నిధులు మంజూరుచేశారు. ఇప్పటికే ఆయన రూ.5లక్షలు ఇచ్చిన విషయం విదితమే. శనివారం బ్లడ్‌సెంటర్‌ను మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డితో కలిసి సందర్శించారు. బ్లడ్‌సెంటర్ విశేషాలు, పరికరాల గురించి ఆయనకు వివరించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ బ్లడ్‌సెంటర్‌కు కావాల్సిన సహాయ సహకారాలు అందిస్తామని తెలియజేశారు. రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ పీవీఎం శరత్ బాబు, కోశాధికారి జి.మురళీకృష్ణ, మేనేజింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ రేహమతుల్ల, డాక్టర్ సృజన, కేఎంయస్‌వి శ్రీనివాసగుప్తా, బత్తుల మురళి, మాజీ కౌన్సిలర్ షేక్ మస్తాన్‌వలి, వైఎస్సార్ సీపీ నాయకులు పాలపర్తి వెంకటేశ్వరరావు, గంటెనపాటి గాబ్రియేలు, మూరే రవీంద్రరెడ్డి, కారుమంచి మీరావలి పాల్గొన్నారు.

తారస్థాయికి కూటమి దుశ్చర్యలు



జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాజీ మంత్రి అంబటి రాంబాబు, మాజీ ఎంపీ మోదుగుల, ఎమ్మెల్సీ ఏసురత్నం, అంబటి మురళీకృష్ణ, వనమా, నూరిఫాతిమా, నిమ్మకాయల

- రాష్ట్రంలో ఏ సమస్య లేనట్లుగా అక్రమ కేసుల పరంపరకు తెరలేపారు
- ప్రభుత్వ వైఫల్యాలపై చర్చ జరగకూడదనే ఈ అక్రమ కేసులు
- ఇప్పటికే 111 మంది వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కార్యకర్తలపై కేసులు
- మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు
- అక్రమ కేసులు నిరసిస్తూ జిల్లా ఎస్పీకి వినతిపత్రం

నగరంపాలెం: రాష్ట్రంలో ఏ సమస్యలేనట్టుగా సూపర్ సిక్స్ అమలు చేయలేదనే చర్చ ఉండకూడదనే ఒక వింత పోకడను కూటమి ప్రభుత్వం అనుసరిస్తోందని మాజీ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా విభాగంపై అక్రమ కేసులు బనాయించడాన్ని తీవ్రంగా నిరసిస్తూ శనివారం గుంటూరు జిల్లా పోలీస్ కార్యాయలంలో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం అంబటి మీడియాతో మాట్లాడారు. బాలికలు, మహిళలు, యువతులపై దాడులు, లైంగిక దాడులు, హత్యలు కూటమి ప్రభుత్వం వచ్చాక తారస్థాయికి చేరాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటివరకు ఇటువంటి దుశ్చర్యలు 90 నుంచి వందకు చేరాయని ఆరోపించారు. అయితే ఈ తరహా ఘటనలపై చర్చ రాకూడదనే ఉద్దేశంతోనే ప్రభుత్వ పెద్దలు వైఎస్సార్ సీపీ సోషల్ మీడియాకు సంబంధించి 111 మంది కార్యకర్తలను అర్ధాంతంగా తీసుకువచ్చి, పోలీస్‌స్టేషన్లలో నిర్బంధిస్తున్నారని అన్నారు.

రాష్ట్ర చరిత్రలోనే ప్రథమం..

సోషల్ మీడియా కార్యకర్తలపై తప్పుడు కేసులతో పలు సెక్షన్లు నమోదు చేసి న్యాయమూర్తుల ముందు పోలీసులు హాజరుపరుస్తున్నారని చెప్పారు. రోజుల తరబడి పోలీస్‌స్టేషన్లలో నిర్బంధించి, చిత్రహింసలకు గురిచేస్తున్నారని, ఈ తరహా ఘటనలు రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్నాయని తెలిపారు. ఇంత పెద్దఎత్తున కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించడం రాష్ట్రంలో ఎప్పుడూ లేదన్నారు. రాష్ట్రంలోని అనేక సమస్యలను గాలికొదిలేసి, ఇదే ప్రధాన సమస్యగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఆరోపించారు. వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌పై, వారి కుటుంబంపై, వైఎస్సార్ సీపీపై పోస్టులను పెడుతున్న వారిని కూడా గుర్తించి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. మాజీమంత్రి విడదల రజనీపై ట్రోల్ చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని గతంలో వినతి పత్రం అందించామని ఆయన గుర్తుచేశారు. ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని చెప్పారు.

భార్య భర్తలకు చిత్రహింసలు తగదు..

పాత పోస్ట్ పెట్టారనే నెపంతో పెద్దింటి సుధారాణి, ఆమె భర్త వెంకటరెడ్డిపై తప్పుడు కేసులు బనాయించారని మాజీ మంత్రి అంబటి రాంబాబు ఆరోపించారు. ఏడెనిమిది పోలీస్‌స్టేషన్లకు తిప్పి, అవే కేసులను ఆయా పోలీస్ స్టేషన్లల్లో రిజిస్టర్ చేశారని మండిపడ్డారు. సిరిసిల్ల వేములవాడలో అమ్మవారిని దర్శించుకునేందుకు వెళ్లిన ఆ కుటుంబంపై పోలీసులు దారుణంగా ప్రవర్తించారని అన్నారు. ఆమె ఏమైనా తీవ్రవాదా.. లేదా బాంబులు పెట్టిందా.. లేదా హింసాత్మక సంఘటనలకు పాల్పడిందా అని ఆయన కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పోస్ట్ పెట్టడం నచ్చకపోతే కేసు నమోదు చేస్తే సరిపోతుందికదా అని అన్నారు. ప్రస్తుతం భార్యభర్తలను జైలుకి పంపించారని, వారు ఉగ్రవాదులా, లేదంటే ఈ ప్రభుత్వాన్ని కూల్చడానికి ఏమైనా కుట్ర పన్నారా అని ఆయన సూటిగా ప్రశ్నించారు. పోలీస్ అధికార యంత్రాంగం చంద్రబాబు, లోకేష్ గుప్పిట్లో ఉందని ఆరోపించారు. మానవ హక్కులను హరించే విధంగా పోలీసులు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వాలు మారుతుంటాయని, ఆ తర్వాత సస్పెన్షన్‌లు ఉంటాయని, ఉద్యోగాలు పోయే అవకాశం ఉంటుందని పోలీసులకు గుర్తు చేశారు. జిల్లా ఎస్పీని కలిసిన వారిలో వైఎస్సార్ సీపీ గుంటూరు, పల్నాడు జిల్లాల పార్లమెంట్ పరిశీలకులు మోదుగుల వేణుగోపాలరెడ్డి, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, పార్టీ సమన్వయకర్తలు షేక్ నూరిఫాతిమా (గుంటూరు తూర్పు), అంబటి మురళీకృష్ణ (పొన్నూరు), వనమా బాలవజ్రబాబు (తాడికొండ), దొంతిరెడ్డి వేమారెడ్డి (మంగళగిరి), మేయర్ కావటి మనోహర్‌నాయుడు, మిర్చియార్డు మాజీ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, కార్పొరేటర్లు అంబేడ్కర్, మొహమూద్, ఈచంపాటి ఆచారి, యాట్ల రవి, బూసి రాజలత, పద్మావతి, నాయకులు అగ్గిపెట్టి రాజు, పునూరి నాగేశ్వరరావు, మర్రి సత్యం, వివిధ విభాగాల నాయకులు ఉన్నారు.

‘పచ్చ’ ఖాకీల దాష్టీకం

- కొనసాగుతున్న అక్రమ అరెస్ట్‌ల పరంపర
- నేరుగా దౌర్జన్యానికి పాల్పడుతున్న ఖాకీలు
- ఐదు రోజులు సుధారాణికి నరకం చూపించిన చిలకలూరిపేట సీఐ రమేష్
- న్యాయమూర్తి ఎదుటే వాగ్మూలం ఇచ్చిన బాధితురాలు
- తనను, తన భర్త వెంకటరెడ్డిని దుర్భాషలాడటంతో పాటు, తీవ్రంగా కొట్టారని వాపోయిన వైనం
- కళ్లం హరికృష్ణారెడ్డిపై మరిన్ని కేసులకు సన్నద్ధమైన పోలీసులు..?



పట్నంబజారు: రెడ్‌బుక్ రాజ్యాంగంలోని పేజీలు ఒక్కొక్కటిగా తిరుగుతూనే ఉన్నాయి.. అక్రమ అరెస్ట్‌ల పరంపర కొనసాగుతూనే ఉంది. కూటమి కుట్రలు నిలదీస్తే ఖాకీల లాఠీ వేటు పడుతోంది.. అన్యాయాన్ని ఎదిరిస్తే.. అక్రమ కేసులతో నోరు మూయించే ప్రయత్నాలు జరుగుతున్నాయి.. సోషల్ మీడియా యాక్టివిస్టులను అరెస్ట్ చేస్తూ.. అక్రమ నిర్బంధాలకు తెరదీస్తూ.. పోలీసులు సైతం పచ్చచొక్కాలు వేసుకున్న కార్యకర్తల్లా వ్యవహరిస్తున్నారు. కనీసం మహిళ అని చూడకుండా. అర్ధరాత్రి ఒక మహిళను స్టేషన్‌లో ఉంచకూడదన్న కనీస విషయాన్ని మరిచిన కర్కశపు ఖాకీలు.. వారి స్వామి భక్తిని చాటుకున్నారు.

అక్రమ కేసుల పరంపర..

సోషల్ మీడియాలో పోస్టింగ్‌లు పెడుతున్నారనే నెపంతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా సభ్యులు, సానుభూతిపరుల అక్రమ అరెస్ట్‌ల పర్వానికి కూటమి ప్రభుత్వం తెరదీసిన విషయం విదితమే. ఈ క్రమంలో ఇప్పటికే మంగళగిరి నియోజకవర్గం తాడేపల్లికి చెందిన వైఎస్సార్ సీపీ గుంటూరు సోషల్ మీడియా అధ్యక్షుడు మేకా వెంకట్రామిరెడ్డిని అక్రమ అరెస్ట్ చేశారు. తాడేపల్లి పోలీసుస్టేషన్‌లో మూడు కేసులు, మంగళగిరి రూరల్‌లో ఒకటి, గుంటూరు నగరంపాలెం పీఎస్‌లో ఒక కేసు నమోదు చేసి అక్రమ కేసులు పెట్టి రిమాండ్‌కు తరలించారు. వైజాగ్‌కు చెందిన ఇంటూరి రవికిరణ్ సీఎం చంద్రబాబుపై ఏదో పోస్ట్ పెట్టారనే నెపంతో.. వర్ల రామయ్య ఫిర్యాదు మేరకు గుడివాడ కోర్టుకు హాజరైన అతనికి 41 నోటీసులు జారీ చేశారు. గత కొద్ది రోజుల క్రితం అరండల్‌పేట పోలీసుస్టేషన్ విచారణ నిమిత్తం హాజరయ్యారు. తిరిగి ఈ నెల 15 తేదీన విచారణకు హాజరు కావాలని పోలీసులు నోటీసులు జారీ చేశారు.

✦ తెనాలి నియోజకవర్గం కొల్లిపర మండలం వల్లభాపురం గ్రామానికి చెందిన ఆళ్ల జగదీష్‌రెడ్డి, 2018లో చంద్రబాబుపై పోస్టింగ్ పెట్టారనే నెపంతో, తెనాలి త్రీ టౌన్ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేయటంతో, కొల్లిపర పీఎస్‌లో కేసు కట్టారు. విజయవాడ సైబర్ క్రైం పోలీసుల ద్వారా ఇబ్బందులకు గురి చేస్తున్నారు. అయితే జగదీష్ రెడ్డికి 41 నోటీసులు జారీ చేశారు. సైబర్ పోలీసులు మాత్రం ఒకటికి పలుమార్లు విచారణ నిమిత్తం రమ్మంటూ.. ఇబ్బందులకు గురి చేస్తున్నారు.


సుధారాణి దంపతులకు నరకం చూపించి..

నా బిడ్డలు ఎక్కడ ఉన్నారో తెలియటంలేదు.. ఐదు రోజుల పాటు నన్ను, నా భర్తను అక్రమంగా అదుపులోకి తీసుకుని చిత్రహింసలకు గురి చేశారు.. చిలకలూరిపేట సీఐ రమేష్ మహిళనని కూడా చూడకుండా నన్ను తీవ్రం కొట్టాడు.. నా భర్తను నానా దుర్భాషలాడారంటూ.. పెద్దిరెడ్డి సుధారాణి సాక్ష్యాత్తూ న్యాయమూర్తి ఎదుట ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. చిలకలూరిపేటకు చెందిన వెంకటరెడ్డి, సుధారాణి దంపతులు. నల్గొండ జిల్లాలో నివాసం ఉంటున్నారు. సిరిసిల్ల సమీపంలోని బొజ్జమ్మ తల్లి ఆలయంలో కాంట్రాక్ట్ పనులు చేసుకుంటున్న వెంకటరెడ్డి వద్దకు సుధారాణి వెళ్లారు. భార్యభర్తలిద్దరూ.. వారి ఇద్దరి పిల్లలతో ఈ నెల 5వ తేదీన కలిసి జొన్నవాడలోని రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయానికి వెళ్లిన క్రమంలో చిలకలూరిపేట సీఐ రమేష్, మరో ఏడుగురితో కూడి బృందంతో ఉగ్రవాదులను అదుపులోకి తీసుకున్నట్లు జీపులోకి ఎక్కించుకుని బలవంతంగా చిలకలూరిపేటకు తరలించారు. అక్కడ ప్రత్యక్ష నరకాన్ని చూపించి.. తరువాత ఒంగోలు తరలించారు. అక్కడ సైతం ఆమెపై వేధింపుల పర్వం ఆగలేదు. అక్కడ కూడా తమ ఇద్దరిని తీవ్రంగా కొట్టారని ఆమె న్యాయమూర్తికే స్వయంగా చెప్పారు. పోస్టింగ్ పెట్టింది సుధారాణి అయితే.. భర్త వెంకటరెడ్డి పోస్టింగ్‌కు సహకరించారని అక్రమ కేసు బనాయించారు. పోలీసులు కొట్టిన దెబ్బలకు సుధారాణి కనీసం నడవలేని పరిస్థితుల్లో.. చేతులు నల్ల రక్తపు గడ్డలు ఉండటం ప్రతి ఒక్కరినీ ఎంతో బాధకు గురి చేసింది. వైఎస్సార్ సీపీ న్యాయవాదులు వారి జాడ తెలియకపోవటంతో హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేయటంతో, కొత్తపేట పోలీసులు ఈ నెల 8 తేదీ ఉదయం 3గంటల సమయంలో ఒంగోలు నుంచి తీసుకుని వచ్చి హడావుడి అరెస్ట్ చూపించారు. ఈ క్రమంలో ఒకే పోస్టింగ్‌కు సంబంధించి సుధారాణిపై ఆరు పోలీసుస్టేషన్‌లలో కేసులు నమోదు అయ్యాయంటే.. కూటమి దమనకాండ అర్థమవుతుంది.

కేసు వెంట కేసు పెట్టేందుకు సిద్ధం..

గత ప్రభుత్వం పని చేయలేదని అంటున్నారు.. ఇదిగో ఈ శాఖలు మీ దగ్గరే ఉన్నాయి కదా..? ఇప్పుడు మీరు చేయటానికి ఇబ్బంది ఏంటీ అని వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కళ్లం హరికృష్ణారెడ్డి సామాజిక మాధ్యమాల్లో అడిగిన ప్రశ్నలు. వీటికే కూటమి నేతల మనోభావాలు దెబ్బతినేశాయి. అత్యంత ఘోరంగా వ్యాఖ్యలు చేశారని.. పునుగుపాటి ఆంజనేయులు అనే టీడీపీ కార్యకర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి హరికృష్ణారెడ్డిని అక్రమంగా బంధించారు. స్టేషన్‌లో ఒక రాత్రంతా ఉంచి.. అరెస్ట్ చేసి కోర్టుకు శుక్రవారం హాజరుపరిచారు. అయితే హరికృష్ణారెడ్డికి బెయిల్ వస్తే.. తిరిగి మరో కేసులో అదుపులోకి తీసుకునేందుకు పక్కా ప్రణాళిక సిద్ధం చేసుకున్నారని సమాచారం. అప్పటికే స్టేషన్ బయట భారీగా పోలీసు బలగాలను మొహరించారు. తిరిగి మిగతా స్టేషన్‌లలో ఉన్న కేసుల్లో అరెస్ట్ చేసేందుకు పోలీసులు పన్నాగం పన్నారనేది బహిరంగ రహస్యమే. కూటమి నేతలు.. వారికి చెప్పు చేతల్లో నడుస్తున్న ఖాకీల తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. భావస్వేచ్ఛను సామాజిక మాధ్యమాల్లో తెలియజేస్తే.. ఇటువంటి అక్రమ అరెస్ట్‌లకు తెరదీస్తారా.. అనే ప్రశ్నలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

ఏఎన్‌యూ అధ్యాపకులకు ‘ఉత్తమ’ అవార్డులు



ఎస్‌వీ కృష్ణారావు



డి.రామచంద్రన్



వై.అశోక్ కుమార్



ఎం.త్రిమూర్తిరావు



పి.పూర్ణచంద్రరావు



పి.బ్రహ్మాజీరావు

ఏఎన్‌యూ: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రాష్ట్ర స్థాయి ఉత్తమ అధ్యాపక అవార్డులకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి ఆరుగురు అధ్యాపకులు ఎంపికయ్యారు. వీరిలో ఆచార్య ఎస్.వి.కృష్ణారావు (తెలుగు), ఆచార్య డి.రామచంద్రన్ (కెమిస్ట్రీ), ఆచార్య వై.అశోక్ కుమార్ (అంబేడ్కర్ చైర్), ఆచార్య ఎం.త్రిమూర్తి రావు (సోషల్ వర్క్), డాక్టర్ పి.పూర్ణచంద్రరావు (టూరిజం), డాక్టర్ పి.బ్రహ్మాజీరావు (ఎన్విరాన్‌మెంటల్ సైన్స్)లు ఉన్నారు. వీరికి ఈ నెల 11వ తేదీన విజయవాడలోని ఏ కన్వెన్షన్ సెంటర్లో జరిగే కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌లు అవార్డులను అందజేయనున్నారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికైన వారికి యూనివర్సిటీ ఉన్నతాధికారులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందనలు తెలిపారు. ఉత్తమ అధ్యాపక అవార్డుకు ఎంపికైన కెమిస్ట్రీ అధ్యాపకుడు, దూరవిద్య కేంద్రం పరీక్షల కో–ఆర్డినేటర్ ఆచార్య డి.రామచంద్రన్‌ను శనివారం దూరవిద్య కేంద్రంలో జరిగిన అభినందన కార్యక్రమంలో సన్మానించారు. దూరవిద్యాకేంద్రం డైరెక్టర్ ఆచార్య వి.వెంకటేశ్వర్లు, అధికారులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.

రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీలు ఆరంభం

- అండర్‌–17 బాలుర, బాలికల విభాగాల్లో పోటీలు
- ఉమ్మడి–13 జిల్లాల నుండి పాల్గొన్న 26 జట్లు
- పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు



పోటీలను ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే రామాంజనేయులు



అండర్‌-17 బాలికల విభాగంలో తలపడుతున్న వెస్ట్‌గోదావరి, కడప జిల్లాల జట్లు

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు మండలం యనమదల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి 68వ ఏపీ ఎస్‌జీఎఫ్ ఇంటర్ డిస్ట్రిక్ట్ బేస్‌బాల్ టోర్నమెంట్ కం సెలక్షన్లు శనివారం అట్టహాసంగా ఆరంభమయ్యాయి. స్థానిక జాతీయ రహదారి సమీపంలోని గ్రౌండ్‌లో అండర్‌– 17 బాలుర, బాలికల విభాగాల్లో జరిగిన బేస్‌బాల్ పోటీల్లో ఉమ్మడి పదమూడు జిల్లాల నుంచి 416 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఒక్కో జిల్లా తరఫున బాలుర విభాగం నుంచి ఒక జట్టు, బాలికల విభాగం నుంచి ఒక జట్టు చొప్పున మొత్తం 26 టీమ్‌లు పోటీల్లో పాల్గొన్నాయి.

పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే..

మూడు రోజుల పాటు జరగనున్న టోర్నమెంట్‌ను తొలిరోజు స్థానిక ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు బేస్‌బాల్ ఆడి ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. తొలుత క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు సహజమన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు సెంటినియల్ ప్రెసిడెంట్ బాలసుబ్రహ్మణ్యం సహకారంతో క్రీడాకారులకు భోజన వసతితో పాటు సౌకర్యాలను కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడా స్ఫూర్తితో ఆడాలని కోరారు. కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ జిల్లా సెక్రటరీ ఎం.రవి, టోర్నమెంట్ అబ్జర్వర్ శ్రీకాంత్ రెడ్డి, బేస్‌బాల్ జిల్లా అసోసియేషన్ చైర్మన్ తాళ్ల వెంకటేష్‌యాదవ్, జిల్లా సెక్రటరీ కె. జయరావు, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ బి. గంగాధరరావు, ఎస్‌జీఎఫ్ జిల్లా మాజీ సెక్రటరీలు పి.మస్తాన్‌రెడ్డి, శ్రీనివాసరావు, కొండయ్య, ఇంటర్నేషనల్ సాఫ్ట్ బాల్ ఎంప్లాయ్ జగదీశ్వరరెడ్డి, హైస్కూల్ హెచ్‌ఎం ఎం.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

విజేతలు వీరే..

68వ రాష్ట్ర స్థాయి బేస్ బాల్ పోటీల మొదటి రోజు ఫలితాలను నిర్వాహకులు వెల్లడించారు. లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో పోటీల్లో తొలిరోజు అండర్‌– 17 బాలుర విభాగంలో గుంటూరు, కృష్ణా, శ్రీకాకుళం, విశాఖపట్నం, గుంటూరు విశాఖపట్నం, విజయనగరం, కర్నూలు, అనంతపురం జిల్లాల జట్లు పాల్గొన్నాయి. గుంటూరు, విశాఖపట్నం జిల్లాల మధ్య నిర్వహించిన పోటీల్లో గుంటూరు జిల్లా జట్టు (5–2) రన్స్ తేడాతో విజేతగా నిలిచింది. శ్రీకాకుళం, కృష్ణ జిల్లాల మధ్య జరిగిన పోటీలలో శ్రీకాకుళం జట్టు 7–2 తేడాతో, విజయనగరం, కర్నూలు జిల్లాల మధ్య జరిగిన పోటీలో కర్నూలు జిల్లా జట్టు 2–1 తేడాతో, అనంతపురం, చిత్తూరు జిల్లాల మధ్య జరిగిన పోటీలో అనంతపురం జట్టు 5–4 తేడాతో విజయం సాధించింది.

- చివరి లీగ్ మ్యాచ్‌లో గుంటూరు, నెల్లూరు జట్లు పోటీపడగా 7–1 తేడాతో గుంటూరు జట్టు జయభేరీ మోగించింది.

బాలికల విభాగంలో..

ప్రకాశం, తూర్పుగోదావరి, శ్రీకాకుళం, అనంతపురం, పశ్చిమగోదావరి, విజయనగరం, గుంటూరు, కర్నూలు, విశాఖపట్నం జిల్లాల నుంచి జట్లు పాల్గొన్నాయి.

- ప్రకాశం జిల్లా తూర్పు గోదావరి జిల్లా జట్ల మధ్య జరిగిన పోటీల్లో ప్రకాశం జట్టు 7–1 విజయం సాధించింది.
- శ్రీకాకుళం జిల్లా అనంతపురం జిల్లాల మధ్య జరిగిన పోటీల్లో శ్రీకాకుళం జట్టు 4–2,
- విజయనగరం, పశ్చిమగోదావరి జిల్లాల మధ్య జరిగిన పోటీల్లో విజయనగరం జట్టు 2–1 రన్స్ తేడాతో విజయం సాధించింది.
- అదే విధంగా గుంటూరు, కర్నూలు జిల్లాల మధ్య పోటీలో గుంటూరు జిల్లా జట్టు 8–2 తేడాతో గెలిచింది.
- విశాఖపట్నం, కృష్ణ జిల్లాల మధ్య జరిగిన పోటీలో విశాఖపట్నం జట్టు 4–3 తేడాతో విజయం సాధించింది.

రాజధాని అభివృద్ధి పూర్తికి ప్రభుత్వం నిర్ణయం

తాడికొండ: కొత్త రాజధాని పరిధిలో రాబోయే మూడేళ్లలో వరద పనులు, నగర అభివృద్ధి పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని సీఆర్డీయే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. వరద పనులు, అభివృద్ధికి 2019–24 మధ్య అమలు చేసి ఉంటే 25–30 శాతం తక్కువ ఖర్చుతో రాజధాని నిర్మాణ పనులు పూర్తయ్యేవన్నారు. 2015–19 లో టాటా కన్సల్టింగ్ ఇంజినీర్స్, నెదర్లాండ్స్ ఆధారిత సంస్థ ఆర్కాడిస్ సంయుక్తంగా వందేళ్ల రిటర్న్ పిరియడ్ 24 గంటల వర్షపాతం 222 మిల్లీ మీటర్ల, భవిష్యత్ నగర అభివృద్ధి నుంచి వచ్చే రన్నరప్‌లను పరిగణనలోకి తీసుకొని అమరావతిని వరద రహిత నగరంగా చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేసిందన్నారు. ఇందులో భాగంగా కొండవీటి వాగు, పాల వాగుల వెడల్పు లోతులను పెంచి దానికనుగుణంగా పంపింగ్ స్టేషన్లతో ప్రణాళికలు సిద్ధం చేసిందని, రాష్ట్ర జలవనరుల శాఖ డిజైన్‌లను పరిశీలించి, రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ వరద నిర్వహణ ప్రణాళికను సమీక్షించి ఆమోదించినట్లు చెప్పారు. ఏపీ ప్రభుత్వం ఎస్ఎస్ఆర్ ప్రకారం రాజధాని నగరంలో వరద నిర్వహణ పనులు పన్నులతో కలిపి రూ.2062.78 కోట్లు అంచనా వేయబడిందని ప్రకటనలో తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

తెనాలిరూరల్: రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నిడుబ్రోలు, మాచవరం స్టేషన్ల మధ్య శనివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సుమారు 30 ఏళ్ల వయసున్న వ్యక్తి గూడ్సు రైలు ఎదుటకు వచ్చి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు రైలు లోకో పైలట్ రైల్వే అధికారులకు సమాచారమిచ్చాడు. జీఆర్పీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. తెనాలి జీఆర్పీ ఎస్ఐ జి.వెంకటాద్రి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 9440627554 నంబరులో సంప్రదించాలని కోరారు.

ఇటుక రాళ్లు పైనబడి వ్యక్తి దుర్మరణం

పెదకాకాని: వ్యక్తిపై ఇటుక రాళ్లు పడడంతో మృతి చెందిన ఘటన కంతేరురోడ్డు సమీపంలో శనివారం చోటుచేసుకుంది. తాడేపల్లిగూడెం నుంచి ఇంటికి వెలివేషన్ వర్క్ పనులు చేసే ఇటుకలను వాహనంలో గుంటూరు తరలిస్తున్నారు. వాహనంపై సత్యనారాయణ అనే కూలి కూర్చుని ఉన్నాడు. ఏఎన్‌యూ సమీపంలోకి రాగానే టైర్ పంక్చర్ కావడంతో వ్యక్తి కింద పడడంతో అతనిపై ఇటుకలు పడి ఊపిరాడక మృతి చెందాడు. సీఐ టి. నారాయణస్వామి కేసు నమోదు చేశారు.

కోర్టు ఆదేశాల మేరకు వసతులు



నగరంపాలెం: కోర్టు ఆదేశాల మేరకు బోరుగడ్డ అనిల్‌కుమార్‌కు కనీస వసతులు కల్పించామని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలోని సమావేశ మందిరంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. అనిల్‌ను అరెస్టు చేశాక వైద్య పరీక్షల కోసం జీజీహెచ్‌కు తరలించారని చెప్పారు. గ్యాస్, శ్వాసకోశ సమస్యలు, వరిబీజంతో బాధపడుతున్నట్లు అతను వైద్యుల దృష్టికి తీసుకొచ్చాడని పేర్కొన్నారు. పోలీస్ కస్టడీకి అప్పగించే సమయంలో అనారోగ్య సమస్యలపై అతను జిల్లా న్యాయస్థానం ఎదుట చెప్పగా, నిందితుడు నిద్రించేందుకు కనీస సౌకర్యాలు కల్పించాలని పోలీస్ శాఖను ఆదేశించారని వివరించారు. ఆ మేరకు వసతులు కల్పించినట్లు చెప్పారు. ఎవరికి రాచ మర్యాదలు చేయాల్సిన అవసరంలేదని స్పష్టం చేశారు. చట్టం ముందు అందరూ సమానమే అని అన్నారు.

పీఆర్ డిప్లొమా ఇంజనీర్స్ అసోసియేషన్ కార్యవర్గం

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఇంజినీర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఏఎస్ రాంబాబు, కె. రమేష్ ఎన్నికయ్యారు. శనివారం జెడ్పీ ప్రాంగణంలోని పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ సమావేశపు హాల్లో గుంటూరు జిల్లా ఏపీ పీఆర్ డిప్లొమా ఇంజనీర్స్ అసోసియేషన్ ఎన్నికలను నిర్వహించారు. అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షునిగా షేక్ ఫిరోజ్ లాల్, కార్యనిర్వాహక కార్యదర్శిగా జి.జయశ్రీ, ఆర్థిక కార్యదర్శిగా బీహెచ్ సాంబశివరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల ప్రక్రియలో అసోసియేషన్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎంఎస్ఎస్ ప్రసాద్, డీఈఈ ఎన్నికల అధికారిగా, పల్నాడు జిల్లా అధ్యక్షులు పి.విభీషణ్ ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించారు. నూతనంగా ఎన్నికైన జిల్లా కమిటీ సభ్యులను పలువురు ఉద్యోగులు అభినందించారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా అధ్యక్షులు ఆర్.మోహన్‌రావు పాల్గొన్నారు.

ఆంధ్ర క్రికెట్ జట్టు విజయం





మంగళగిరి: పట్టణ పరిధిలోని నవులూరు అమరావతి టౌన్‌షిప్‌లో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో నిర్వహిస్తున్న కూచ్ బెహారా ట్రోఫీలో ఆంధ్ర క్రికెట్ జట్టు ఘనవిజయం సాధించింది. తొలి ఇన్నింగ్స్‌లో ఆంధ్ర జట్టు 615 పరుగులు సాధించగా, అనంతరం బ్యాటింగ్ చేపట్టిన హిమాచల్ ప్రదేశ్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 132 పరుగులకే ఆల్ అవుట్ కాగా రెండవ ఇన్నింగ్స్‌లో 283 పరుగులు సాధించింది. దీంతో ఆంధ్ర జట్టు 200 పరుగులు తేడాతో ఘనవిజయం సాధించింది.